భానుమతీ రామకృష్ణ

# చక్రపాణీ-రాజధానీ!



సాయంకాలం అయిదుగంటలవేళ హైద్రాబాదు వీధులన్నీ అలజడిగా వున్నాయి. .... ఒకవైపునుంచి పెద్ద గుంపు పరుగెత్తుకొస్తున్నారు కేకలేసుకొంటూ. .... "బాబోయ్ చంపేస్తున్నారు.... పొడిచేస్తున్నారు._ త్వరగా పరుగెత్తండి.... ఎరక్క యీ వైపొచ్చాం దేవుడా._" అంటూ.

అదే సమయంలో ఒక సన్నటి పొడుగాటి వ్యక్తి తాపీగా ఆ వైపు నడిచిరావడం చూసి ఆ గుంపులోయిద్దరు ఆగి, "ఏం చావడానికిటొచ్చావా?"_ అని నిలదీశారు. .... అది విని సన్నటి పొడుగాటి వ్యక్తి తాపీగా తాగే సిగరెట్ చిటికెన వేలుతో విదిలించి.

"ఏం.... చచ్చే వచ్చాను...." అన్నాడు.

"అంటే.... అన్నారు వాళ్లు కనుబొమలు చిట్లించి....

"అంటే, నేను చచ్చిపోయి నాలుగైదేండ్లు అయిందిలే. .... నా పేరు చక్రపాణి. నా కిక చావులేదు...."అది విని వాళ్లు ఒక్కసారిగా,

"అయ్యబాబోయ్.... యితను మనిషిగాడు...." అంటూ గావుకేక పెట్టి అక్కణ్ణుంచి పరుగు లంకించుకొన్నారు....

చక్రపాణిగారు మరికొంత దూరం నడిచారు.... మళ్లీ కొందరు గుంపుగా రావడం చూసి, వాళ్లని చక్రపాణిగారే ఆపి "ఏంటయ్యా.... ఎందుకు పొడుచుకొని వస్తున్నారు.... ఏం జరిగింది...."అని అడిగిన చక్రపాణిగారికి సమాధానం యిచ్చే సమయమూ, సహనమూ లేని ఆ గుంపు "ఏమో మాకు తెలీదుబాబూ. అవైపు అల్లర్లుగా వున్నాయ్._ ముందు మమ్మల్ని పోనీండి...." అంటూ పరుగెత్తిపోయారు.

యింతలో వెనకనుంచి "నమస్కారం చక్రపాణిగారూ." .... అంటూ వచ్చి చక్రపాణిగారి ముందు నిలబడ్డాడొక పెద్దమనిషి.... అతనెవరో తెలీని చక్రపాణిగారు ఆ పెద్దమనిషిని ఎగాదిగా చూశారు.... మళ్లీ ఆ పెద్దమనిషే అడిగాడు "ఏమిటిట్లా వచ్చారూ.__"

"ఎట్లా రమ్మంటావ్.... అన్నాడు చక్రపాణిగారు.

"అదికాదండీ. మీరు...."

"ఎందుకొచ్చానంటావ్.—చూడూ ప్రతి ఏడాదీ దీపావళి ముందు నేను హైద్రాబాదు వస్తుంటా, మా దీపావళి యువ యిష్యూ ఎట్టా తయారవుతుందో చూట్టానికి.... అస్సరే గానీ యిక్కడ ఒకే అల్లర్లుగా వున్నాయంటనే...."

"అవునండీ. యీ రోజు నే నొక్కణ్ణి తప్ప మిగతా అంతా పారిపోయారు._ యిప్పుడు ఎక్కువ లేవులెండి అల్లర్లు. గవర్నమెంట్ కంట్రోల్ చేశారు._ కాని సైక్లోనూ, వరదలూ చాలా జననష్టం చేసి తెలుగుదేశం అంతా దెబ్బ తిన్నది...."

"ప్రతి ఏటా యిదొక పీకులాటే.... వానలు కురవకపోతే

నీళ్లులేక చస్తున్నారు, కురిస్తే వరదల్లో చస్తున్నారు!.... గవర్నమెంట్ దీని కేదైనా చేయాలి!...."

"అన్నట్లు రామారావుగార్ని చూశారా!...."

"ఏదీ యిప్పుడేగా వస్తున్నా!...."

"పోయిన సంవత్సరం వచ్చినప్పుడు చూశారా! చీఫ్ మినిష్టరుగార్ని!...."

"పోయిన సంవత్సరం దీపావళి ముందు నేనొచ్చినప్పుడు రామారావెక్కడున్నాడయ్యా చీఫ్‌మినిష్టర్‌గా!...."

"చిత్తం- చిత్తం!.... అప్పటికింకా ఆయన సి. యమ్. కాలా!.... ఎలక్షన్ల గొడవలో వూళ్లన్నీ తిరుగుతున్నారు అప్పట్లో!...."

"అందుకే చూళ్లా!.... ఏదో వేన్ ఒకటి కొని తిరిగాడని విన్నా!...."

"అవునండి!.... ఒక్కొక్క పల్లే, ఒక్కొక్క యిల్లూ, చివరికి చిన్నచిన్న గుడిసెల్లో కెళ్లి బీదప్రజలతోపాటు కూర్చుని "అమ్మా అన్నంపెట్టు" అని దోసిలిపట్టి వాళ్ల చేత ముద్దలు వేయించుకు తిన్నారటండి!.... ప్రతి ఆడదీ "అన్నా అన్నా అని...."

"అది నే విన్నా...."

"ఎండలో తిరిగి ఎంత కష్టపడ్డారనుకొన్నారు!.... నల్లబడ్డారు బాగా!...."

"ఎప్పుడూ ఎ సి రూములో కూర్చునేవాడు మరి ఒక్కసారి ఎండలోకొస్తే కష్టమే గద!.... అంత ఎండలో అదే పనిగా తిరిగితే నల్లబడక తెల్లబడతాడా!.... నీకో కథ తెల్సా!...."

"తెలీదండి!...."

"ముప్పయ్యేళ్ల కొకసారి శనీశ్వరుడు ఒక రౌండ్ తిరిగొస్తాడు ప్రతివాడి జీవితంలో!.... అట్టా రావడంలో ఒకనాడు వెండికొండ మీద కూర్చున్న శివుడి దగ్గరకొచ్చాడంట!.... శివుడు దేవుడు గనక మర్యాదిచ్చి "యిదుగో చూడు శివుడా నిన్ను నేను అయిదు క్షణాలు పట్టబోతున్నానన్నాడంట!.... శివుడు మొండోడూ, ఆవేశపరుడు గదా!.... 'అదంతా నాతో పెట్టుకోబాక. నీకునేచిక్కన్లే!....'అన్నాడంటఅలక్ష్యంగా!... శనీశ్వరుడు నవ్వేసి పోయాడంట! ... వెంటనే శివుడు శనికి దొరక్కుండా ఒక చెట్టుతొర్రలో పురుగురూపంలో దాక్కున్నాడు!.... ఆ అయిదు క్షణాలూ అయింతర్వాత శనిగాణ్ణి మోసంచేశామగదానే విజయగర్వంతో చెట్టుతొర్రలోంచి బయటి కొచ్చాడు శివుడు!— ఎదురుగ్గా శని నవ్వుతూ నిలబడ్డాడు!.... 'చూశావా, నేను నీకు దొరకనన్నాగా!' అన్నాడు శివుడు శనిని చూసి!.... అది విన్న శనీశ్వరుడు పగలబడి నవ్వుతూ 'అయ్యో పిచ్చి శివుడా!.... నేను నిన్ను పట్టుకోబట్టే గదా వెండికొండమీద వుండాల్సినోడివి పురుగువై యీ చెట్టుతొర్రలో దాక్కున్నావు!— అన్నాడంట...."

"అప్పుడు శివుడేమన్నాడండీ"—

"ఏమంటాడు!— గుడ్లెళ్లబెట్టుంటాడు!.... అట్టా వుందిను చెప్పిందింటే"—

"అయితే యీశ్వరుణ్ణే వదల్లేదన్నమాట శనీశ్వరుడు! ఏమైనా రామారావుగారు సి.యమ్.కావడం గొప్ప గదండీ!—"

"ఏం గొప్పంట!.... యాక్టర్ రామారావు గొప్పంటే ఒప్పుకొంటా!.... అసలు చీఫ్ మినిష్టర్ కావడానికి పునాది యాక్టర్ రామారావేగద!— లేకపోతేయీయనేమైనా దేశసేవ చేశాడా!— జైల్లోకెళ్లాడా!— ఆస్తిపాస్తులు దేశానికి పంచిపెట్టాడా? ఏం త్యాగంచేశాడని ఓట్లేశారు జనం!.... యాక్టర్ రామారావుమీద మోజుతోనే గదా!.... అంతెందుకూ! నీకు ఇంకో సంగతెల్సా!...."

"నాకే సంగతీ తెలీదండి"....

"కన్నడ దేశానికి శానా ఏండ్లుగా రాజ్‌కుమార్ అనే హీరో మకుటంలేని మహారాజనొచ్చు!.... అతను చీఫ్ మినిష్టరు కావాలనుకొంటే ఎలక్షన్ గొడవలేకుండానే అరగంటలో కాగల్డు!— అతనంటే కన్నడ జనానికి అంత పిచ్చి! .... మన తెలుగోళ్లకి రామారావన్నా అంతే!.... యింతెందుకూ! అమితాబ్బచ్చన్ యీ రోజు ప్రైమ్‌మినిష్టర్ కావాలని నిలబడితే ఇండియా మొత్తం ఓట్లు అతనికే పడతయ్! అదొక గొప్పాంట!.... ఎంతైనా సినిమా 'ఇమేజ్' ఎప్పుడూ గొప్పదంటా! రాజకీయాల్లోకి దిగితే రొచ్చే! తెల్లటి ఇస్త్రీ గుడ్డ బురదలో బడ్డట్టే!—"

"గొప్ప నిజం చెప్పారు!.... అయినా మన ఆంధ్ర దేశంలో గడిచిన రెండుమూడు సంవత్సరాల్లో చాలామంది చీఫ్ మినిష్టర్లు మారడం జరిగింది!.... చాలా విచారకరమైన విషయం! ..."

"ఎందుకయ్యా విచారం? అట్ట మార్చబట్టేగద మన రామారావు సులభంగా రాగలిగాడు!...."

"అవునండోయ్! గొప్ప పాయింటే శెలవిచ్చారు!.... దాంట్లోగూడా రామారావుగారికిరాజకీయాలు బాగాతెలుసు!..."

"మళ్లీ అక్కడే పప్పులో కాలేశావ్!...." అన్నాడు చక్రపాణిగారు సిగరెట్ వెలిగిస్తూ.... గతుక్కుమన్నాడు పెద్దమనిషి!....

"రాజకీయాలు తెలిసినవాళ్లకి ఆవేశం, తొందరపాటూ వుండకూడదంటారు తెల్సా!....

"చిత్తం అవన్నీ పూర్వం రాజులకీ, మహారాజులకీ

వుండేవనీ, మాట మాట్లాడితే కత్తి దూసేవారనీ కథల్లో చదివాం గదండీ!_ అయినా రామారావుగారు యిప్పుడు కాషాయగుడ్డలు కట్టుకొని రాజఋషిగా వుంటున్నారు!...."

అది విని చక్రపాణిగారు చిన్నగా నవ్వారు!.... పెద్దమనిషి వెలవెలబోతూ "తమరు నవ్వారు!".... అన్నాడు.

"మరి ఏదవమంటావయ్యా.... కాషాయ గుడ్డలు కట్టినంత మాత్రాన ఋషి ఎట్టా అవుతాడయ్యా!.... తన చుట్టూ ముళ్లపొదలా వున్న బాధ్యతల్నించి బయటపడగల్డా!.... ఒక పెద్ద వేదాంతి చెప్పాడులే!.... ఎనకటికి ఎవడో ఒకడు తన నీడ తనతో కూడా వుంటం నచ్చక, ఎట్టనయినా పూడ్చిపెట్టాలని తీర్మానం చేసుకొని, తన నీడ పడ్డచోట గబగబా గుంట తవ్వడం మొదలుపెట్టాడంట!.... గుంట తవ్వేకొద్దీ తన నీడ గుంటలో పడడం చూసి సంతోషపడిపోతూ యింకా బాగా లోతుకు తవ్వాడంట!.... ఆ నీడ గూడా బాగా లోతుకు పోయిందంట!.... అతను ఒదిలిందిరా శని అంటూ ఆ నీడని ఆ గుంటలో మట్టేసి పూడ్చడం మొదలెట్టాడంట!.... మట్టేసి పూడ్చేకొద్దీ మట్టి మీద తన నీడగూడా పైకిరావడం మొదలెట్టింది!.... పూర్తిగా గుంట మూసి చూస్తే తన నీడ ముందెక్కడుందో అక్కడే వుందట!.... చచ్చిందాకా చావులా వెంటబడే నీడని పూడ్చిపెట్టడం ఎట్టాంటిదో పుట్టుకతో వొచ్చిన సహజ గుణాలు మార్చడం గూడా అట్టాంటిదే!...."

"అయితే సినిమావాళ్లకి రాజకీయాలు తెలీవంటారా!...."

"అట్టా ఎందుకంటాను!... యిప్పుడు అమెరికాలో రీగన్, దక్షిణాదిలో మన ఎమ్.జి.ఆర్. వుండ్లా! ఎమ్.జి.ఆర్. శానా ఏండ్లుగా అణ్ణాదురై, కరుణానిధీ వాళ్లతో పాలిటిక్స్‌లో బాగా నలిగినోడు!...."

"అయితే ఎం.జి.అర్. కూడా సినిమా యిమేజ్‌తోనే రాజకీయాల్లో నెగ్గాడంటారు!...."

"నేనంటం ఏంటయ్యా! ప్రపంచానికే తెలుసు!_ జనానికి హీరోగా అతనిమీదుండే పిచ్చి అభిమానంతోనే ఆనాడు డి.యమ్.కె. పార్టీకి ఓట్లువేశారు!_ పైగా ఎమ్జిఆర్ తను చేసే సినిమాలన్నిట్లో గూడా డైలాగుల్లో, పాటల్లో డియమ్కె పార్టీ ప్రచారం బాగాచేసి పార్టీకి పునాదులేశాడు!_ అసలు ఎమ్జిఆర్ లేకపోతే డియమ్కె అనే ఒక పార్టీ అంత ప్రబలం అయ్యేది గాదు!_ యీనాటికీ మిగతా అందరూ పోయినా ఎమ్జిఆర్‌కి స్టార్‌గా, సి.మ్.గా మంచి పేరుంది!_"

"అదంతా అతనికి సినిమాలిచ్చిన 'యిమేజ్' యిప్పటికీ అతను బయట జనంలోకొస్తే యింత ముసలోడై గూడా యింకా ఆడామగా అతన్ని చూట్టానికి ఎగబడుతారు! అతని పాత సినిమాలన్నీ గుర్తుపెట్టుకొని!.... ఏం యిప్పుడు రామారావు బయటికెళ్తే ఆయన్ని రాముడుగా, కృష్ణుడుగా దుర్యోధనుడుగా, కర్ణుడుగా, ఒక దేవుడుగా చూట్టానికి జనం విరగబట్టంలా!.... అదే సమయంలో సినిమాల్లో లేని చీఫ్ మినిష్టరు ఎవరన్నా ఒస్తే అట్టా యిరగబడి చూడమను!.... సి.ఎమ్. 'యిమేజ్'కంటేసినిమా'యిమేజ్'గొప్పదయ్యా!..."

"నీకో సంగతి తెల్సా!...."

"తెలీదండి!...."

"నీకు తెలీదని నాకు తెలుసులే!.... ఆ మధ్య అరవదేశంలో...."

"యిక్కడ తెలుగుదేశంలాగా అరవదేశం అనే పార్టీ వుందాండీ!...."

"అదిగాదయ్యా!_ తమిళనాడు."

"ఓహో మనం ఆ మధ్య 'తెలుగునాడు' అన్నాంలెండి!."

"మనం అంటున్నావు! నేనెప్పుడన్నాను!...." గతుక్కుమన్న పెద్దమనిషి గుటకమింగి "అబ్బే మీరు కాదండీ!.... యిక్కడ మన తెలుగుదేశం పార్టీవారు అట్లా గూడా అన్నారు ఆంధ్రదేశాన్ని...."

"అదేంటో నాకు తెలీదుగానీ సినిమా పిచ్చి జనంలో ఎంత ఎక్కువైందో యీ మధ్య జరిగిన ఒక చిన్న తమాషా కథ చెప్తా విను!__"

"చిత్తం చెప్పండి!...."

"ఆ మధ్య మద్రాసుకి నూరుమైళ్ల దూరంలో వున్న విల్లిపురం అనే వూరికి దక్షిణాదిలో మంచి పేరున్న కృపానంద వారియార్ అనే హరికథలు చెప్పే పెద్దయాన్ని ఏదో ఫంక్షన్‌కి పిలిపిస్తే ఫస్టుక్లాసులో రైల్లో వస్తున్నాడంట!.... ఏదో వూర్నుంచి!....అదే రైల్లో యిప్పుడు అరవ సినిమాల్లో 'హాట్ కేక్'లాగున్న సిల్క్ స్మిత అనే జయమాలినిలా 'సెక్స్' డాన్స్‌లు చేసే సినిమాస్టారు ఆయనున్న 'ఫస్టుక్లాసు కంపార్ట్‌మెంట్'లోనే ఎక్కిందంట ఏ వూర్నుంచో వస్తూ... ఆ కంపార్ట్‌లో ఆ పెద్దాయనా ఆ స్మితా వాళ్లతో వచ్చిన ఒకళ్లిద్దరు తప్ప యింకెవ్వరూ లేరంట!...."

"ఆహా! విశ్వామిత్రుడూ మేనకా 'కాంబినేషన్'అనండి!" అన్నాడు పెద్దమనిషి వెకిలిగా నవ్వుతూ!....


"మధ్య నువ్వెందుకయ్యా మెలికలు తిరిగిపోతావ్!...."

చటుక్కున బిగుసుపోయిన పెద్దమనిషి, "చిత్తం! స్మిత చాలా అల్లరిపిల్లగదా, ఆ పెద్దాయనతో ఏంమాట్లాడిందండి."

"నే విన్లా!.... నాకు యితర్లు చెప్పింది చెప్తా విను...."

"చిత్తం."

"ఆ పెద్దాయన శానా లావుగా వుంటాడులే, అతను బాత్




రూంకెళ్ళి చాలీచాలని చిన్న అంగవస్త్రం కట్టుకొని స్మిత కెదురుగా వున్న సీట్లో కూర్చున్నాడంట!...."

"మంచి రసవత్తరమైన ఘట్టం!" అన్నాడు పెద్దమనిషి మళ్ళీ సిగ్గుతో మెలికలు తిరుగుతూ!

"ఆ సంగతి యిప్పుడు నీ అవస్థ చూస్తేనే తెలుస్తావుందిలే!- స్మిత పేరు వింటేనే నువ్విన్ని మెలికలు తిరుగుతున్నావే! మరి స్మితలేంది యీనాడు అరవ సినిమా అమ్మడు పోదనటంలో తప్పేంలేదు!...."

"అవునండీ! ఆ పిల్లంటే జనానికి భలే పిచ్చటండీ!.... అయితే ఆ కృపానంద వారయార్‌గార్ని కూడా స్మిత తన బుట్టలో వేసుకొందాండీ!...."

"ఆయన్ని బుట్టలో వేసుకుందో ఒళ్ళో వేసుకుందో ఆ సంగతి నాకు తెలీదుగానీ, మొత్తానికి ఆయన్నీ ఆయన కట్టుకున్న చాలీచాలని చిన్న అంగొస్త్రాన్నీ చూసి సూటిగా ఒకే మాట అడిగిందంట!....

"స్వామీ!.... మీరు గొప్ప పండితులూ వేదాంతం వేలాది ప్రజలకి బోధించే మహాత్ములూ, మీరు యిలా చాలీచాలని చిన్నగుడ్డకొని మీ ఒళ్ళు సగం బయటికి తెలుస్తున్నా మిమ్మల్ని చూసి ఎవరూ ఈలలు వేయరు. గలాటాచేయరు!- పైగా మీరీ చిన్న గుడ్డగూడా తీసేసి గోచీ పెట్టుకొంటే యింకా మీ గొప్పతనం పెరిగిపోయి సాష్టాంగ నమస్కారాలు చేస్తారు!.... మరి సినిమాల్లో యీ చిన్నగుడ్డ నేను కట్టుకుని ప్రొడ్యూసర్లు గెంతమన్నట్టల్లా గెంతుతున్నాను!.... మరి నన్నెందుకు విమర్శిస్తారు, అసహ్యించుకొంటారు కొందరు!- మీ గోచీకి లేని పేచీ నే కట్టే పీలికల కెందుకు రావాలి!.... చెప్పండి!...." అని నిలదీసిందంట ఆ హరికథలాయన్ని!....

"అబ్బా! అబ్బా! అద్భుతంగా వుంది స్మిత అడిగిన ప్రశ్న!.... ఏంచెప్పాడో ఆ పెద్దాయన!...."

"ఏం చెప్తాడు!.... ఏ హరికథల్లోదో పిట్టకధ చెప్పి వుంటాడా పిల్లకి!.... ఊ!.... అసలు సంగతిను!.... ఇంతలోనే ఆ పెద్దాయన దిగాల్సిన విల్లిపురం స్టేషనొచ్చిందంట. ఆయన్ని 'రిసీవ్' చేసుకోడానికి పెద్ద మాలలూ బుట్టలబుట్టల పూలూ తెచ్చారంట అయన్నాహ్వానించిన ఫంక్షనువాళ్ళంతా!.."

"ఇంతలోకే ఆ గుంపులో ఎవరో సిల్క్‌స్మితని గుర్తుపట్టారంట!.... అంతే!.... సిల్క్‌స్మితరోయ్! అంటూ ఆ గుంపంతా ఆ పిల్లచుట్టూ మూగి ఆ మాలలన్నీ, ఆ పిల్ల మెళ్ళోవేసి, కపార్ట్‌మెంట్‌లోకి జొరబడి వాళ్ళు పెద్దాయనకి తెచ్చిన బుట్టలబుట్టల పూలన్నీ ఆ సిల్క్‌స్మిత మీద పోసేశారంట పిచ్చి సంతోషంతో!....

"ప్రజల్లో సినిమా పిచ్చి మరీ రోజురోజుకి చాలా ఎక్కువై పోయిందండి!...."యింతకీ ఆ పెద్దాయన్ను ఏంచేశారో పాపం!

"పచ్చుడికింద తొక్కారంట!.... చావుతప్పి కన్న

లొట్టపోయి ప్లాట్‌ఫారమ్‌మీదికెళ్లి పడ్డాడంట!.... ఇంతకీ నే చెప్పొచ్చేదేంటంటే!...."

"అర్థం అయిందండి!.... మీరు చెప్పేదాంట్లో ఎన్నో నగ్నసత్యాలున్నాయి!...."

"ఊ!.... ఇంతకీ మన రామారావుగారి ఆరోగ్యం బాగుంది గదా!...."

"ఆ! బాగానే వున్నారండీ!.... ఒక్కటే ఆయన బాధ! .... ప్రజలకేదో చేయాలనీ, వాళ్లకేలోటూ లేకుండా వాళ్లకేంకావాలో...."

"అసలు వాళ్లకేం కావాలో వాళ్లకే తెలుసాంట!...." చక్రపాణిగారు తాపీగా అడిగారు....

పెద్దమనిషి తెల్లబోయి "బాగా చెప్పారు!...." అన్నాడు.

"అసలు రామారావు రాజకీయాల్లో రాణించగూడదని లోపల్లోపల కుళ్లుకొని చచ్చేవాళ్లు మనోళ్లల్లోనే శానామంది వున్నారు!..." అన్నాడు చక్రపాణిగారు సిగిరెట్ విదిలిస్తూ....

"అబ్బో! శానా పెద్దపెద్దోళ్లే వున్నారండి పైకి పెద్ద మనుషులనబడేవాళ్లు. అంతెందుకండీ ఆయన సి.యమ్ అయిన కొత్తల్లో ఎవరో ఒక సినిమా పెద్దమనిషే అడిగాడటండి యింకో సినిమా పెద్దమనిషిని. 'రామారావుగారు ఎంతకాలం వుంటాడంటారీ పోస్టులో!....' అని."

"అది నే విన్నాలే!.... యింకో తమాషా తెల్సా!...."

"తెలీదండి! ...."

"ఏం ఆయన పార్టీలోవాళ్లే కొందరు ఎమ్.ఎల్.ఏ.లు మినిష్టరీలు వస్తాయని ఎదురుచూసి రాకపొయ్యేసరికి 'ఉత్సవ విగ్రహాల్లా వుంటానికా యింత డబ్బు తగలేశాం!' అంటూ ఏడ్చుకుంటున్నారంట!...."

"చూశారా!.... ఎంత అన్యాయం!...."

"అంతేగాదు.... రామారావుకి బాగా తెలిసినోళ్లందరి దగ్గరికీ ఎళ్లి 'మీ రామారావే గదండీ ఒక్కమాట ఆయన్తో చెప్పండి మమ్మల్ని మినిష్టర్లని చెయ్యమని!....' అని బ్రతిమాలారంట!....'

"అదేనండీ ఆయన పార్టీ గౌరవం పాడుకాకూడదు గదండీ!...."

"పార్టీ సంగతి దేవుడెరుగు!.... ముందాయన సంగతేమిటంట! యిట్టా వున్నయి రాజకీయాలు!.... నా మాట రుచించదు గానీ ఒకప్పుడున్న గౌరవం యీనాడు రాజకీయాలకి లేదుగదా! అంతెందుకూ యీనాటి రాజకీయాల్లో దేవుడే దిగొచ్చినా జనాన్ని తృప్తిపరచలేడు ప్రస్తుత పరిస్థితుల్లో!.... రష్యాలో రామరాజ్యం రావాలన్నట్టుంటుంది అందర్నీ తృప్తిపర్చడానికి ప్రయత్నించడం!...."

"బాగా చెప్పారు.... ఎలాగైనా రామరాజ్యం చేయాలనే రామారావుగారి తపన!...."

"అదే తప్పంటా!".... మళ్లీ గతుక్కుమన్నాడు పెద్దమనిషి....

"రామరాజ్యం అనే ఒక సినిమా తీసి అందులో సి.ఎమ్. వేషం వేసి యాక్టుచేసి ఎన్ని నీతులు చెప్పినా జనం అదే నిజమని నమ్మి సంతోషించి రామారావుకి బ్రహ్మరథం పడతారు గానీ నిజజీవితంలో అతను ఎంతో సిన్సియర్‌గా దేశం బాగుచెయ్యాలని తపనపడ్డా, అదంతా ఒట్టి యాక్టింగ్ అంటూ తేలిగ్గా చప్పరించేస్తారు!.... అదే యీ పెద్దపెద్ద స్టార్లయినవాళ్లకి ఒక పెద్ద డిజడ్వాంటేజ్. వాళ్లు నిజంగా ఏడిస్తే జనం నవ్వుతారు!.... అదే వాళ్లు సినిమాల్లో గ్లిజరిన్ వేసుకుని వుత్తుత్తినే ఏడిస్తే జనం వాళ్లతోపాటు ఏడుస్తారు!... అయినా తెలీకడుగుతాగానీ రామరాజ్యం అంటే నీ ఉద్దేశంలో ఏంటీ అని!...." అని నిలదీశాడు చక్రపాణీగారు. మళ్లీ ఆ పెద్దమనిషి గతుక్కుమన్నాడు!....

"చిత్తం!.... రామరాజ్యం అంటే ప్రజలకి ఏ లోపం లేకుండా...." నసిగాడు పెద్దమనిషి....

"మళ్లీ అక్కడే దెబ్బతిన్నావ్!.... ప్రజలకి ఏ లోటూ రాకుండా చూసుకొన్న రాముణ్ణి ఒక చాకలివాడు నానా బూతులూ తిట్టాడయ్యా!.... రావణాసురుడి పంచన పడున్న పెళ్లాన్ని మళ్లీ తెచ్చుకొని ఆ చచ్చురాముడు గనక ఏలుకుంటున్నాడు!.... నేనైతే నరికి పోగులేసేవాణ్ణి. అన్న.... అసలు ఆ ఆచాకలోడే హీరో అంటాన్నేను!....ఊ!....అంత గొప్ప రాముడూ ఆ దెబ్బతో 'ఫ్లాట్' అయినాడా లేదా....!"

"చిత్తం అబ్బో!.... రామరాజ్యం కావాలంటే చాలా 'సెల్ఫ్ శాక్రిఫైస్' చేయాలండి మరి!...."

"యిప్పుడు మినిష్టర్లు చస్తే చెయ్యరు!.... అందులోనూ సినిమా మినిష్టర్లు అట్లాంటిది పొరపాట్న గూడా చెయ్యరు!... అదంతా ఆ పాత కాంగ్రెసోళ్లతోటే పోయింది!...."

"యిప్పుడు మినిష్టర్లయ్యేది వున్న ఆస్తుల్ని వృద్ధిచేసుకోడానికీ, కూతుళ్లకీ, కొడుకులకీ, కావాల్సినోళ్లకీ, లేని ఆస్తుల్ని ఏడుతరాలకి సరిపడేటట్లు సంపాదించి పంచడానికే!.... శాక్రిఫైస్ అనేది మహ్మగాంధీ, నెహ్రూలాంటి గొప్పోళ్లతోనే అంతం అయింది.... యింతకీ హైదరాబాదు సినిమావాళ్లేమంటున్నారు!...." అన్నాడు చక్రపాణి మరో సిగరెట్ వెలిగిస్తూ....

"మద్రాసులో వుండే సినిమావాళ్లందరూ హైద్రాబాదు రావాలంటున్నారు!...."

"చస్తే రారు!....అదిప్పట్లో జరిగే పనిగాదు...."

"అదీ నిజమేలా కనిపిస్తోంది పైగా సబ్‌సిడీలు తీసేశారంటున్నారు!...."

"మంచిపని చేశారుః.... అదొక దండగా గవర్నమెంట్‌కిః...."

"మరి హైదరాబాదులో ఫిలిం పరిశ్రమ అభివృద్ధి చెందే దెట్లాగండీః...."

"అందుకని పిల్లలకి చాకలెట్ చూపించి దగ్గరికి పిల్చినట్టు ఎంతకాలం సబ్‌సిడీలిచ్చి చేతులు కాల్చుకుంటారు గవర్నమెంటోళ్లుః.... పీకేస్తే ఆ పీకులాటే లేదుగాః...."

"అదేనండి కొందరికి అసంతృప్తిః...."

"చెప్పానుగాః అందర్నీ తృప్తిపర్చడం ఆ దేవుడివల్లే గాదనిః...."

"అకాడెమీలను గురించి ముఖ్యంగా సంగీత నాటక అకాడమీః...."

"ఆ సంగతి నా దగ్గరెత్తక. నాకు చిర్రెత్తుకొస్తదిః...."

"ఆస్థానకవిగార్ని తీసేయడం సరస్వతీదేవిని అవమానించినట్లే అని కొందరు అంటున్నారుః"....

"అదేదో నాకు తెలీదుగానీ, మనదేశంలో ఈనావరకూ మంచి కవులే డబ్బులేక కష్టపడేది ఏ కొద్దిమందో తప్పః.... అదొక పెద్ద ఖర్చుగాదు సబ్‌సిడీల్లాగాః వుంచిందొచ్చుః.... ఆదినుంచీ వస్తున్నదే గనక...."

"చిత్తం మీరు కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడతారండీః .... కాని స్వామీః...."

"నే స్వామిని గాదయ్యాః ఒట్టి చక్రపాణ్ణి."

"అదేనండిః.... మీ రొచ్చిన యీ సమయంలో రామారావుగారు రాజధానిలో లేకపోవడం చాలా బాధగా వుందిః... రామారావుగారంటే మీకెంత అభిమానమో అందరూ చెప్పుకొంటూంటే విన్నా...."

"అవును. ఒకప్పుడు అతనిమీద యీగవాల్నిచ్చేవాణ్ణి గాదుః.... ఎంతయినా మా విజయా హీరో గదః...."

"చిత్తంః.... ఆ పాత అభిమానాలు పోవు...." అని ఆ పెద్దమనిషి చక్రపాణిగారితో మాట్లాడుతుంటే యమభటు లొచ్చారు.

"పదః ప్రొద్దుననంగ కత్తిపోటుతో చచ్చి మా కళ్లల్లో కారంకొట్టి పారిపోయొచ్చి బాతాఖానీ లేస్తున్నావాః పదపదః" అంటూ ఆ పెద్దమనిషి రెండుచేతులూ పట్టుకొని లాగడం మొదలెట్టారుః...."

అది చూసి చక్రపాణిగారు ఒక్కసారి గతుక్కుమని "ఓరి చచ్చినోడాః.... నువ్వా చచ్చినోడివేనాః నాతో యింత సేపు మాట్లాడావ్ః....

"చిత్తంః ప్రొద్దుటే ఆఫీసుకి బయల్దేరి వస్తున్న నన్ను వెనకనుంచి కత్తితో పొడిచారుః...."

"మరి యింతదూరం ఎట్టా వచ్చావ్ యింత సేపు ఎక్కడున్నావ్ః...."

"ఒక చెట్టుకింద దాక్కున్నానండి. దూరాన్నుంచి మిమ్మల్ని చూశాను యిందాక. ఒక్కసారి ప్రాణం లేచి వచ్చిందిః"

"ఈ మాటలు చాలు, బయల్దేరుః".... అని యమదూతలు గద్దించారు ఆ పెద్దమనిషినిః....

"ఉండండోయ్ః అస్సలే యింత సేపు మీరెక్కడున్నారుః ...." చిక్కుప్రశ్న వేశాడు చక్రపాణిగారు. అది విని గతుక్కుమన్నారు యమభటులు"ః....

"మాట్లాడ్రేం...." అని రెట్టించాడు చక్రపాణిగారు సిగరెట్ చివరిదమ్ము లాగుతూ.

"అదేః అదేః ఏదో పాత సినిమా యన్.టి. రామారావు గారిది ఆ పక్కనే ఆడుతుందనీ...."

"ఆ సినిమా చూట్టానికెళ్లారుః అంతేనాః...." సిగరెట్ కాలికింద నలిపేశాడు చక్రపాణిగారు.

యమదూతలు ఒకళ్ల మొఖాలు ఒకళ్లు చూసుకున్నారు గుటకలు మింగుతూ....

"ఏం మాట్లాడ్రేంః...."

"అవునండిః.... అన్నారు భయపడుతూ...."

"బాబ్బాబు మీరు యీ విషయం మా చిత్రగుప్తుడుగారితో యమధర్మరాజుతో చెప్పకండి చక్రపాణిగారూ. రామారావు గారి మీదుండే అభిమానంతో ఆ సినిమాకెళ్లాంః.... మా ఉద్యోగాలు పోతయ్ యీ సంగతి పైన తెలిస్తేః...."

"చెప్పన్లేగాని ఆ పెద్దమనిషిని మర్యాదగా తీసుకెళ్లండిః పాపం అర్ధాంతరంగా చచ్చాడుః.... నిన్ను నే నొచ్చి కలుస్తాన్లే అన్నాడు చక్రపాణిగారు- దూతల్ని చూసి భయపడుతున్న పెద్దమనిషితోః....

"అయ్యా చక్రపాణిగారూ మీరు నాతో రాగూడదూః కొత్త చోటు నాకుః...."

"ఏం ఫర్వాలేదు అలవాటుపడతావ్‌లేః యిక్కడ్లానే వుంటుందక్కడ గూడాః.... పైగా నే వస్తాగాః మా మనవడి పెళ్లి ఏర్పాట్లు ఎట్టా చేస్తున్నారో చూడాలః.... మా దీపావళి యువకి యింకా భానుమతి కథరాసి పంపిందో లేదో చూడాలః.... ఎప్పుడూ లేటుగానే పంపుద్దిః.... మా సుధాకర్‌ని చూసి మాట్లాడొస్తా".... అంటూ యువ ఆఫీసు వేపు నడిచి వెళ్లాడు చక్రపాణిగారుః....